బీసీల కోసం పోరాడే జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా నిలుద్దాం

బడుగులను అవహేళన చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పి తీరాల్సిందేనంటున్న బీసీ సంఘాలు

బడుగుల గొంతుక కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంటుకు పంపిద్దామని బీసీ సంఘాలు పిలుపునిస్తున్నాయి. రాజకీయాలకతీతంగా బీసీలు ఏకమై రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని కోరుతున్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని కుట్రలు చేసినా.. లోక్‌సభ ఎన్నికల్లో తిప్పికొడతామని స్పష్టం చేస్తున్నారు. బీసీల ఓట్లు లేనిదే ఏ పార్టీకీ మనుగడ ఉండదన్న విషయాన్ని ఈ ఎన్నికల్లో రుజువు చేసి చూపించాలని నేతలు పేర్కొంటున్నారు.

ముఖ్యంగా బడుగులను అవహేళన చేస్తున్న రాజకీయ పార్టీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేస్తున్నారు. బీసీల శక్తిని, చైతన్యాన్ని ప్రదర్శించి ఆయా పార్టీల నేతల నోళ్లను మూయించాలని చెబుతున్నారు. బీసీల కోసం పోరాడే వ్యక్తులే కరువయ్యారని.. ఈ పరిస్థితుల్లో బీసీల హక్కుల కోసం పోరాడేందుకు బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఎంపీగా ఉండాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావిస్తున్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ)

బడుగుల గొంతుక కాసాని

బీసీ నాయకుడిని గెలిపించుకుందాం

చేవెళ్ల ఎంపీగా బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు బీఆర్ఎస్ పార్టీ ఆరు పార్లమెంట్ సీట్లు కేటాయించడం సంతోషకరం. బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న కేసీఆర్.. బడుగు, బలహీన వర్గాల నేతకు చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని బీసీ సోదరులంతా సద్వినియోగం చేసుకొని కాసానిని గెలిపించి పార్లమెంట్‌కు పంపిద్దాం.

- మంగళి కరుణాకర్, కక్కులూర్, షాబాద్ మండలం

చేవెళ్ల గడ్డపై బీసీల సత్తా చాటాలి

చేవెళ్ల గడ్డపై ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీసీల సత్తా చాటాలి. బీసీలంతా ఐకమత్యంగా ఉండి, కాసాని గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి. మన సత్తా ఏంటో ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేసిన అనుభవం ఉన్న జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే బీసీల సమస్యలపై పోరాటం చేస్తారు.

- దయాకర్‌చారి, దామర్లపల్లి, షాబాద్ మండలం

బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచే నాయకుడు కాసాని

ఉమ్మడి జిల్లా అభ్యున్నతికి ఎంతో కృషిచేసి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచే నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్. కాసాని లాంటి నాయకుడు పార్లమెంట్‌లోకి వెళ్లే నిరుపేదలు అభివృద్ధి చెందుతారు. బీసీలందరూ కలిసికట్టుగా కాసాని జ్ఞానేశ్వర్ వెంటే ఉండాలి. బీసీ నాయకుడిని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తాం.

- ఎం.కిష్టయ్య అంగడిచిట్టంపల్లి, పూడూరు మండలం

జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం

బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బీసీ సామాజిక వర్గానికి మొండిచేయి చూపగా.. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ బీసీ వర్గానికి చెందిన కాసానికి టికెట్ ఇచ్చారు. కాసాని గతంలో ఉమ్మడి రంగారెడ్డిలో అనేక హోదాల్లో బీసీ వర్గాలకు చెందిన నాయకులను చైతన్యపర్చారు. బీసీ మేధావులు, విద్యావంతులు, యువకులు బీసీ అభ్యర్థిని గెలిపించి మన ఐక్యతను చాటాలి.

- జావిద్, మన్నెగూడ, పూడూరు మండలం

బీసీల సత్తా ఏమిటో చూపిద్దాం

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ మొదటి నుంచి ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అనేక మంది బీసీలకు బీఆర్ఎస్ చేయూతనందించింది. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు టికెట్‌ను కేటాయించి బీసీల ఆత్మగౌరవాన్ని నిలిపింది. బీసీలంతా రాజకీయాలకతీతంగా కాసానిని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

- మల్లేశ్ ముదిరాజ్, రంగారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, మణికొండ

రాజకీయాలు పక్కనబెట్టి గెలిపించి చూపిస్తాం

బీసీలను తక్కువ చేసి మాట్లాడిన మోహన్‌రెడ్డిలాంటి వాళ్లు చాలామందే ఉన్నారు. కానీ బీసీల్లో ఐక్యత లోపించింది నిజమే.. ఇకనైనా రాజకీయాలను పక్కనబెట్టి చేవెళ్ల గడ్డపై బరిలో ఉన్న కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుని సత్తా చాటుదాం. ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటువేసి మన ఐక్యతను చాటిచెప్పాలి. అగ్రకులాల నేతలు మనందరినీ ఓటు రాజకీయాలకు బలిపశువుల్లా వాడుకుంటున్నారు.

- కొణతం లక్ష్మణ్‌గౌడ్, ఎండీ, కేఎల్ ఇన్‌ఫ్రా, మణికొండ

జ్ఞానేశ్వర్‌తో బీసీల అభివృద్ధి

96 కులాల బీసీ ఐక్య వేదికను ఏర్పాటు చేసి ఏకతాటిపైకి తీసుకువచ్చిన మహా నేత జ్ఞానేశ్వర్. ఈ ఎన్నికల్లో బీసీలందరం ఏకమై పార్టీలకతీతంగా బీసీ బిడ్డను గెలిపించుకోవాలి. అందుకు కారు గుర్తుకు ఓటు వేసి బీసీల శక్తి, చైతన్యం నిరూపించుకోవాలి. అధికారం ఎక్కడ ఉంటే అక్కడ పార్టీలు మారే నేతలకు మనం ఓటు వేయొద్దు.

- రాంచందర్, తాండూరు

జ్ఞానేశ్వర్ విజయం ఖాయం

చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా బీసీ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను కేసీఆర్ ప్రతిపాదించిన సందర్భంగా గెలిపించుకుందాం. కాంగ్రెస్, బీజేపీల రెడ్డి నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా మన బీసీ ముద్దు బిడ్డను భారీ మెజార్టీతో గెలిపించుకునే తరుణం వచ్చింది. బీసీల ఓట్లతో ఇరు పార్టీల నాయకులకు తగిన గుణపాఠం నేర్పుదాం. ఓటు దెబ్బతో బీసీల ఐక్యతను చాటి మన జ్ఞానేశ్వర్ అన్నను గెలిపించి పార్లమెంట్‌కు పంపుదాం.

- కాశయ్య, బీసీ యువ రైతు, మల్లేపల్లి, దోమ మండలం

బీసీలు సిద్ధం కావాలి

రాజకీయాలకతీతంగా బీసీలు సిద్ధమై బీసీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలి. బీసీలందరూ ఐక్యతగా ఉండి పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుదాం. ఇష్టానుసారంగా మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలంటే ఏమిటో రుచి చూపించాలి. కాసానిని ఎంపీగా గెలిపించి పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినబడేట్లు చేయాలి.

- బుడ్డోల్ల నరేందర్‌గౌడ్, గౌడ సంఘం నాయకుడు, కందుకూరు

కాసానిని గెలిపిస్తేనే న్యాయం జరుగుతుంది

బీసీల ఐక్యత లేకుండా ఇతరులు కుట్రలు చేస్తుంద్రు. అన్ని కులాల కంటే బీసీలు ఎక్కువ శాతం ఉన్నారు. బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా అనేక సేవలు చేసింద్రు. ఆయనను గెలిపిస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుంది. కాసానిని గెలిపించి బీసీలంతా ఒక్కటేనని నిరూపిద్దాం.

- కాకి దశరథ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకుడు, కందుకూరు

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయం

నిస్వార్థంతో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి నిరంతరాయంగా పోరాడుతున్న కాసాని జ్ఞానేశ్వరన్న గెలుపు ఖాయం. స్వలాభం కోసం పార్టీలు మారి, టికెట్లు తెచ్చుకున్నంత మాత్రాన ప్రజలు ఆదరిస్తారనుకోవడం అవివేకం. తప్పుడు మాటలు, వాగ్దానాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే నాయకులకు ప్రజలు బుద్ధిచెబుతారు.

- నరేందర్ భల్లా, చందానగర్

బీసీ అభ్యర్థిని గెలిపిద్దాం

చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. ఎన్నో ఏండ్లుగా ప్రజా క్షేత్రంలో ఉంటూ, బీసీల అభ్యున్నతికి పోరాటం చేస్తున్న వ్యక్తిని పార్లమెంట్‌కు పంపిద్దాం. ప్రజా సేవ చేస్తామంటూ ముసుగేసుకుని తమ వ్యాపారాలను వృద్ధి చేసుకునే మోసగాళ్ల డిపాజిట్లు గల్లంతయ్యేలా.. జ్ఞానేశ్వరన్నను గెలిపిద్దాం.

- ప్రవీణ్, శంకర్‌నగర్, చందానగర్

బీసీల ఐక్యతను చాటుదాం



చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి బీసీల బలం చూపిస్తాం. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు బీసీలను పట్టించుకోవడంలేదు. ఎన్నో ఏండ్లుగా బీసీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్పా.. వారికి రాజ్యాధికారం ఇవ్వడంలేదు. 96 బీసీ కులాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి హక్కుల కోసం పోరాటం చేసిన ఘనత కాసాని జ్ఞానేశ్వర్‌కే దక్కింది.

- నర్సింహులు, బొపునారం, బంట్వారం

బీసీ నాయకున్ని గెలిపించుకుందాం

అన్ని ఎన్నికల్లో ఇతర వర్గాల వారికి ఓట్లు వేసిన బీసీలు ఈసారి బీసీ అభ్యర్థికి ఓటు వేసుకునే చక్కటి అవకాశం వచ్చింది. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేసిన బీసీ బిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలి. పార్లమెంటులో తెలంగాణ గొంతుకను వినిపించేలా చేయాలి.

–నర్సింహులు, వికారాబాద్

ఓపెన్ డిగ్రీ పరీక్ష ఫీజు గడువు మే 6

హయత్‌నగర్, ఏప్రిల్ 20 : బీఆర్ఏఓయూ బీఏ, బీకాం, బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థులు మొదటి సెమిస్టర్ ఎగ్జామ్ ఫీజును మే 6లోపు చెల్లించాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్నాప్రభ, స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలు మే 26 నుంచి జూన్ 1 వరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్ష ఫీజు ప్రతి పేపర్‌కు రూ.150 చొప్పున, ప్రాక్టికల్ ఉన్న కోర్సుల్లో చేరిన విద్యార్థులు ప్రతి ప్రాక్టికల్ సబ్జెక్టుకు అదనంగా రూ.150 చొప్పున చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష ఫీజులు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు. మీ సేవా కేంద్రాల్లో గాని, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాల్లో గానీ, ఇంటర్నెట్ సెంటర్ గానీ http://www.braouonline.in/ వెబ్ సైట్‌ను సందర్శించి చెల్లించాలని సూచించారు. వివరాల కోసం 738 292 9771 లో సంప్రదించాలని కోరారు.

నిజాయితీ చాటుకున్న యువకుడు

కందుకూరు. ఏప్రిల్ 20 : దొరికిన ఆభరణాలను తిరిగి ఇచ్చి ఓ యువకుడు తన నిజాయితీని చాటుకున్నాడు. మండల పరిధిలోని జైత్వారం గ్రామానికి చెందిన ఈర్లపల్లి రాణి తన తల్లి గారింటికి వెళ్లడానికి కందుకూరు మండల కేంద్రానికి వచ్చి బస్సు ఎక్కి వెళ్లే సమయంలో 30 తులాల వెండి పట్టగొలుసులు, చెవుల గొలుసును పొగొట్టుకుంది. ఈ ఆభరణాలు దెబ్బడగూడ గ్రామానికి చెందిన అజీజ్ దొరకడంతో వెంటనే కందుకూరు పోలీస్ స్టేషన్ ఎస్సై శ్రావణ్‌కు అప్పగించడంతో సదరు మహిళలను పిలిపించి అప్పగించారు. దొరికిన వెండి ఆభరణాలు తిరిగి ఇవ్వడంతో అజీజ్‌ను ఎస్ఐ అభినందించారు. రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితురాలికి ఆభరణాలను అందజేస్తున్న యువకుడు

ఉద్యోగ విరమణ తప్పదు

మాట్లాడుతున్న పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్

చంపాపేట, ఏప్రిల్20: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూటీఎస్ లక్ష్యమని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్ అన్నారు. శనివారం కర్మన్‌ఘాట్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వాణి కన్యాకుమారి ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్నయ్య గారి గోవర్ధన్ యాదవ్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రెడ్డి, మండల శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్, రాష్ట్ర బాధ్యులు చంద్ర, రాఘవేందర్, విజయసేనారెడ్డి, వెంకటనరసింహారెడ్డి, నరసింహులు, సునీత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కి ఓటేస్తే డ్రైనేజీలో వేసినట్టే

ఆర్కేపురం, ఏప్రిల్ 20 : కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే డ్రైనేజీలో వేసిననట్టేనని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సరూర్‌నగర్ డివిజన్ సాయి కృష్ణానగర్‌లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించి బీజేపీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఆచరణకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలో వచ్చి వాటిని అమలు చేయకుండా పబ్బం గడుపుతున్న కాంగ్రెస్‌ను ఓడించాలనే ఉద్దేశంతో ప్రజలు ఉన్నారని తెలిపారు.

పట్నం సునీతకు మద్దతుగా ప్రచారం

మన్సూరాబాద్, ఏప్రిల్ 20: ప్రచారానికి విశేష స్పందన లభిస్తుందని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించడం ఖాయమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి మన్సూరాబాద్, హరిణ వనస్థలి నేషనల్ పార్కులో మార్నింగ్ వాకర్స్‌ను కలుసుకుని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, వజీర్ ప్రకాష్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, బుడ్డ సత్యనారాయణ, పోచబోయిన క్రిష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

చంపాపేట, ఏప్రిల్20: ఆర్యవైశ్యులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూపిన చిత్తశుద్ధి ఆర్యవైశ్యులందరికీ ఎంతో హర్షణీయమని ఆర్యవైశ్య సంఘం కర్మన్‌ఘాట్ ప్రధాన కార్యదర్శి ఆకుల రమాకాంత్‌గుప్త అన్నారు. 10 సంవత్సరాలుగా ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్న ఆర్యవైశ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడాన్ని హర్షించి తాను ఆర్యవైశ్య సంఘం తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు రమాకాంత్‌గుప్త శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల శ్రవణ్‌గుప్తా, ఆరాధన ఫౌండేషన్ చైర్మన్ సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్‌గా మహేంద్రకుమార్‌రెడ్డి

కందుకూరు,ఏప్రిల్ 20 : కందుకూరు మండల కేంద్రంలో గల భూలక్ష్మి మెమోరియల్ ఆసుపత్రి నిర్వాహకులు లయన్ డాక్టరు మహేంద్రకుమార్‌రెడ్డి లయన్స్ 320 జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్‌గా ఎంపిక య్యారు. లయన్స్ క్లబ్ బలోపేతంతో పాటు పలు సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆయన చేసిన సేవలను గుర్తించి లయన్స్ 320 ఏ 8వ వార్షికోత్సవ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 20: హనుమాన్ శోభాయాత్రను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఉదయం ఎల్బీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతి రోజు ర్యాలీ సాయంత్రం వనస్థలిపురం రామాలయం నుంచి ప్రారంభమై సాహెబ్‌నగర్ త్రినేత్ర ఆంజనేయస్వామి దేవాలయం వరకు సాగుతుందని ఆయన తెలిపారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 23న ఉదయం ఏడున్నర గంటలకు కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాయలం నుంచి ప్రారంభమయ్యే వీర హనుమాన్ విజయయాత్ర బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావినూతల శశిధర్ కోరారు. నాయకులు మహేశ్, బ్రహ్మచారి, నవీన్‌కుమార్, నిఖిల్ సింగ్, రాంరెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, ఏప్రిల్ 20 : సైబర్ నేరాగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ మక్బూల్ జానీ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూట్యూబ్ వాట్సాప్‌లలో వచ్చే అనవసర లింకులను ఓపెన్ చేయకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడికి గుర్తు తెలియని మహిళ న్యూడ్ కాల్ చేసి రూ. 30వేలు డిమాండ్ చేసిందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు కాల్ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

మజ్లిస్‌తోనే పాతబస్తీ అభివృద్ధి

ఆస్మాన్‌ఘడ్‌లో ఇంటింటి ప్రచారంలో పాల్గొని మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

సైదాబాద్, ఏప్రిల్ 20 : పాతబస్తీలోని అన్ని ప్రాంతాల అభివృద్ధి మజ్లిస్ పార్టీతోనే సాధ్యమని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం మలక్‌పేట నియోజకవర్గంలోని సైదాబాద్ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అసదుద్దీన్ ఒవైసీకి మద్దతుగా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబస్తీలో నివసించే అన్ని వర్గాల అభ్యన్నతియే లక్ష్యంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకొచ్చి వారికి అందిస్తుందన్నారు. వివిధ డివిజన్ల మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు నాయకులు, పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

ఎల్బీనగర్ , ఏప్రిల్ 20: పారిశుధ్య సమస్యలపై ప్రజలు దృష్టి సారించాలని, చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా స్వచ్ఛఆటోలకు అందజేయాలని మోహన్‌నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. శనివారం ఉదయం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మోహన్‌నగర్ గ్రామంలో స్వచ్ఛతపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని కోరారు. వేసవికాలంలో నీటి కొరత ఉన్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటిని వృథా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బంది, మోహన్‌నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు మోహన్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు నాలికల నర్సింహ , గోవర్ధన్‌సింగ్, మాణిక్ ప్రభు, రాజు , జగన్ యాదవ్, జవాన్‌లు లక్ష్మయ్య, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉప్పల ఫౌండేషన్ చేయూత

ఆర్థిక సహాయం అందజేస్తున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్త

మన్సూరాబాద్, ఏప్రిల్ 20: నిరుపేద కుటుంబాల్లో జరుగుతున్న ముగ్గురు ఆడబిడ్డల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ చేయూత నిచ్చింది. రంగారెడ్డి జిల్లా, మెయినాబాద్ మండలం, మేడిపల్లి గ్రామానికి చెందిన ప్రశాంతి, నందిని, నందినిల వివాహాలు ఇటీవల నిశ్చయమయ్యాయి. మూడు కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి ఉప్పల ఫౌండేషన్ ద్వారా నాగోల్, కోఆపరేటివ్ బ్యాంకు కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెండ్లి కూతుర్లు ప్రశాంతి, నందిని, పి నందినిలకు పుస్తె, మట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు రాములు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సైదాబాద్, ఏప్రిల్ 20 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకొని ఆమె వద్ద నుంచి 34 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. సైదాబాద్ నీలం రాజశేఖర్‌రెడ్డి నగర్ (చింతల్)లో నివాసముండే సునీత అక్రమంగా మద్యం విక్రయిస్తుందని సమాచారం అందటంతో ఆమె ఇంటిపై పోలీసులు దాడి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.